హైదరాబాద్ వార్త





ఢంకా మోగిస్తున్న రవీంద్రనాయక్, పృథ్వీసింగ్ రాథోడ్,

## 19 నుంచి ఢిల్లీలో "బంజారా భారత్ స్వర్ణోత్సవాలు"

**హైదరాబాద్, నవంబరు 9,ప్రభాతవార్త:** ఈ నెల 19 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో "బంజారా భారత్ స్వర్ణోత్సవాలు "నిర్వహించనున్నట్టు బంజారా భారత్ వ్యవస్థాపక అధ్యక్షులు ధారావత్ రవీంద్రనాయక్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బంజారా భారత్ అధ్యక్షులు పృథ్వీసింగ్ రాథోడ్, నాన్ ఏజెన్సీ వికారాబాద్ ఏరియా అధ్యక్షులు రాఘవన్ నాయక్, జాతీయ మహిళా కన్వీనర్ ఎ. నాగమణి నాయక్, జె.బి.రాజులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బంజారా భాష గోర్బోలి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించి, పార్లమెంట్లో ఆమోదించేలాయాలని కోరారు. కర్ణాటక తరహాలో బంజారతండా ఫైనాన్స్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ భవన్ ఆవరణలో లక్కీషా బంజారా మక్కన్ షా, లాఖానా లాల 125 ఫీట్ల ఎత్తులో కాంస్య విగ్రహాలు ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారులకు, రైలు మార్గాలకు బంజారా ప్రముఖుల పేర్లు పెట్టాలని డిమాండ్ చేశారు.బంజారా జాతి త్యాగాలను గుర్తించి జాతోత్ రాజునాయక్, రామావు మహారాజ్, వి.పి. నాయక్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. బ్రిటిషు, మొగలుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన బంజారాల ధైర్యసాహసాలకు గుర్తుగా బంజారా రెజిమెంట్‌ను స్థాపించాలని కోరారు. అనంతరం వలో బంజారా భారత్ నగారా ఢంకాను రవీంద్రనాయక్ మోగించారు. ఈసమావేశంలో బంజారా నేతలు కె. హరిచంద్ నాయక్, కె.నరేశ్ కుమార్, సజ్జే అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్, తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు

## రేపే పోలింగ్..

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పటిష్టమైన ఏర్పాట్లు**

**4,01,365 మంది ఓటర్లు ..407 పోలింగ్ బూత్‌లు**

**కేంద్రాల వద్ద మొబైల్ డిపాజిట్ కౌంటర్లు..హెల్ప్ డెస్కులు ఏర్పాటు**

**65 లోకేషన్లలో ..226 సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు**

**2,060 మంది పోలీసులు, పారామిలిటరీ బలగాలతో బందోబస్తు**

**డ్రోన్లతో నిరంతర నిఘా...వెబ్ కాస్టింగ్ లైవ్ స్ట్రీమింగ్**

**జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ వెల్లడి**

**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక పోలింగ్‌కు ఎన్నికల యంత్రాంగం, పోలీసు శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. ఈమేరకు ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ వివరాలను వెల్లడించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ఈ ఉప ఎన్నికల్లో మొత్తం 4,01,365 మంది ఓటర్లు పాల్గొననున్నారని తెలిపారు. సోమవారం రాత్రి ఈవీఎంలను కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం నుంచి పోలింగ్ స్టేషన్లకు తరలించనున్నారు. మొత్తం 139 పోలింగ్ లొకేషన్లలో 407 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని ఈసారి ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయన్నారు.ఎన్నిక కోసం 2,060 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 58 మంది అభ్యర్థులు, నోటా కలుపుకొని 59 బ్యాలెట్ యూనిట్‌లో ఉంటాయని, ఇందుకోసం 561 కంట్రోల్ యూనిట్లు, 595 వీవీప్యాట్స్,2,394 బ్యాలెట్ యూనిట్లను అందుబాటులో ఉంచామన్నారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత అమలులో ఉంటుంది. ఓటర్ల క్యూ మెయింటెన్ చేయడానికి ఎన్సీసీ వలంటీర్ల సేవలు అందించనున్నట్లు తెలిపారు.అంతేకాకుండా అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద హెల్ప్ డెస్కులు, మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి వెబ్ కాస్టింగ్ లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందన్నారు. జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ భద్రతా వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 65 లొకేషన్లలో 226 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని గుర్తించామని, ఈ క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద పారామిలిటరీ బలగాలు బందోబస్తులో ఉంటాయని, ఇతర స్టేషన్ల వద్ద పోలీసుల బందోబస్తు పటిష్టంగా ఉంటుందని తెలిపారు. బందోబస్తు కోసం 1,761 లోకల్ పోలీసులు, 8 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు విధుల్లో ఉంటాయన్నారు. ముఖ్యంగా క్రిటికల్ పోలింగ్ స్టేషన్లతో సహా మొత్తం 139 పోలింగ్ స్టేషన్ల వద్ద 139 డ్రోన్ల తో నిరంతరం మానిటరింగ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి శాంతి భద్రతలకు సంబంధించిన ఘటనలు జరగలేదని, 27 ఎన్నికల ఉల్లంఘన కేసులు నమోదయ్యాయని, 230 రౌడీషీటర్లను బైండ్ ఓవర్ చేశామని తెలిపారు. ఇప్పటివరకు 3 కోట్ల 60 లక్షల నగదు పట్టుకున్నట్లు వెల్లడించారు.ఎన్నికల నిబంధనల ప్రకారం వైన్ షాప్స్ నవంబర్ 11 సాయంత్రం వరకు మూసిఉంటాయి. సైలెన్స్ పీరియడ్‌లో అభ్యర్థులు డోర్ టు డోర్ ప్రచారం చేయవచ్చునని అయితే నలుగురు మాత్రమే ప్రచారంలో పాల్గొనాలని నిబంధన విధించారు. వాట్సాప్‌లో బల్క్ మెసేజ్‌లు పంపడం నిషేధం, నియోజకవర్గ ఓటర్లు కాని స్థానికేతరులు వెంటనే వెళ్లిపోవాలని, దీనికోసం హోటల్స్, హాల్స్, ఫంక్షన్ హాళ్లలో తనిఖీలు చేసి ఇతరులను నియోజకవర్గం నుంచి పంపించేస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఓటింగ్ శాతం వివరాలను ప్రతీ రెండు గంటలకు ఒకసారి అనౌన్స్ చేస్తామని ఈసీ అధికారులు తెలి పారు. ఓట్ల లెక్కింపు 42 టేబుల్స్ వద్ద 10 రౌండ్లలో జరుగనుంది. అధికారులు ఓటర్లందరినీ ముందుకు వచ్చి ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు.

## బాబోయ్ చలి..జాగ్రత్త

**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త :** వాతావరణం మారుతోంది. శీతాకాలం వచ్చేసింది. క్రమేణా చలి పెరుగుతోంది. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరిగింది.మూడురోజులుగా రాత్రి సమయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గిపోతున్నాయి. తెల్లవారు జామున చలి గాలుల తీవ్రత అధికంగా ఉంటోంది. ఆదివారం నగరంలో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతగా నమోదైంది. నగరంతో పోల్చితే శివారు ప్రాంతాల్లో చలితీవ్రత అధికంగా ఉంది. చలిపులి విజృంభించక ముందే దాని బారి నుంచి రక్షణ కోసం నగరవాసులు జాగ్రత్త పడుతున్నారు. క్యాప్‌లు, స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాటిని కొనుగోలు చేసేందుకు షాపుల దారిపడుతున్నారు.



# ముగిసిన ప్రచారం.. పోలింగ్‌కు సర్వం సిద్ధం

*** ఓటింగ్ పెంపునకు అధికారుల కసరత్తు * మూగబోయిన మైక్‌లు**



**జూబ్లీహిల్స్, నవంబరు 9, ప్రభాతవార్త**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం ఆదివారంతో ముగిసింది. పదిహేను రోజులుగా ప్రచార కార్యక్రమాలు, ఇంటింటి ప్రచారాలు, మార్మోగిన ప్రచార రథాలు అన్నీ మూగబోయాయి. నిశ్శబ్దం లోకి జారుకున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రాంతాల్లో ఓటింగ్ వేడి ఇంకా కొనసాగుతూనే ఉంది.అంతుపట్టని ఓటరు నాడిని పట్టుకొనేందుకు ఇప్ప టికే 'డబ్బు ఎర' చూపిన నేతలు ఇక రెండు రోజుల పాటు ఓటింగ్‌ను మరల్చుకొనేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను ప్రధాన రాజకీయ పార్టీలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపును తమ ఖాతాలో వేసుకొని తద్వారా రాష్ట్రంలో రానున్న రోజుల్లో తమదైన ముద్ర వేసుకోవాలని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే అన్ని రాజకీయ పార్టీలు తమ నాయకత్వాన్ని, కార్యకర్తలను అందరిని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళ్‌రావునగర్, సోమాజీగూడ, షేక్‌పేట డివిజన్లలో మొహరించాయి. ప్రతి డివిజన్‌కు ఇద్దరు ముఖ్య నాయకులను కేటాయించి ఓటింగ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలు చేశారు. బూత్‌ల వారీగా నాయకులను ఎంపిక చేయడమే కాకుండా ఏజెంట్లుగా వ్యవహారించే వారికి అవసరమైన సూచనలు చేయడం తోపాటు కొన్ని పార్టీలు ఏకంగా శిక్షణను సైతం ఇచ్చాయి. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు జాగత్రగా గమనించాలని సూచించాయి.

**చేయి పట్టుకోవాలని...**

కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే అభ్యర్థి ఎంపిక నుంచి మొదలుకొని ప్రచారం వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మంత్రి వర్గాన్ని దాదాపుగా నియోజకవర్గంలోని డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. పది రోజులుగా మంత్రులు నియోజకవర్గంలో తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఓటర్లను కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. బీఆర్ఎస్ అడ్డాగా ఉన్న జూబ్లీహిల్స్ స్థానాన్ని తన ఖాతాలో వేసుకొని ప్రజాపాలనకు ప్రజలు పడుతున్న బ్రహ్మరథనం అని నిరూపిం చుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం ప్రయత్నిస్తుంది. ఇందుకోసం అవసరమైన అన్ని అస్త్రశస్త్రాలు విని యోగిస్తున్నారు. గెలుపు కోసం అవసరమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సినీ కార్మికులతోపాటు అన్ని కుల సంఘాలను కలుప కొని ముందుకు వెళ్తున్నారు. రేవంత్‌రెడ్డి సైతం గత నెల 31 నుంచి ఈ నెల 7 వరకు డివిజన్ల వారీగా కార్నర్ మీటింగ్‌లు నిర్వహించి బీఆర్ఎస్, బీజేపీలను ఎండగట్టారు. అధికారంలో ఉన్నపార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు అభివృద్ధికి ఓటు వేయాలంటూ కోరారు. తమ అభ్యర్థి దాదాపు 30 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఇప్పటికే ప్రకటించారు.

**కారు గేరు మార్చేందుకు...**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం గత రెండుసార్లు బీఆర్ఎస్ ఖాతాలోనే ఉంది. ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ తొలుత టీడీపీలో గెలుపొందినప్పటికీ రాజకీయంగా చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన తరువాత బీఆర్ఎస్‌లోకి చేరి రెండు దఫాలుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగు తున్నారు. ఆయన అకాల మృతితో వచ్చినపడిన ఈ ఎన్నికల్లో ఆయన సతీమణికి బీఆర్ఎస్ పార్టీ సీటు కేటాయించింది. అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో తమ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో తమ పట్టును కోల్పోకుండా ఉండేందుకు కేటీఆర్ ఈ నియోజకవర్గంపై ప్రత్యేకంగా దృష్టి సారిం చారు. ఈ సీటును కైవసం చేసుకొని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మరో మూడేళ్లలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం కావాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే నియోజక వర్గం మొత్తం ఆయన ప్రచారబాట పట్టారు. డిజిటల్ తెరలు ఏర్పాటుచేసి కాంగ్రెస్ పార్టీ మాటతప్పిన హామీలతోపాటు పేదలపై హైడ్రా ప్రతాపం పేరుతో రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిని గెలిపించాలంటూ తెలుగు, హిందీ మిశ్రమ శాయరీలతో ప్రచారానికి కొత్త ఊపు తీసుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న అసహనం ఖచ్చితంగా తమను గెలుపు తీరాలకు తీసుకెళ్తుందని ఆయన భావిస్తున్నారు.

**కమల వికాసం కోసం...**

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు బిజెపిని లక్ష్యంగా చేసుకున్నప్పటికీ తమను రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎన్నుకోవాలని ప్రజలను బిజెపి కోరుతోంది. ఈ క్రమంలోనే బిజెపి నేతలు, కేంద్ర మంత్రులైన కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావుతో పాటు పార్టీ యంత్రాంగం మొత్తం ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టింది. అభ్యర్థి ఎంపికకాస్త ఆలస్యమైనా ముందు నుంచే పార్టీ పరంగా ప్రచారాన్ని ప్రారంభించింది. బిజెపి అభ్యర్థిని గెలిపించాలని గల్లీగల్లీలో ప్రచారం నిర్వహించారు. నియోజకర్గంలో నెలకొన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ నిధులతో చేస్తామంటూ ప్రజలకు హామీ ఇస్తున్నారు. మరోవైపు చివరి రెండు రోజులు బండి సంజయ్ ప్రచారం నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లోనూ కొత్త ఊపు తీసుకొచ్చింది. తమను గెలిపిస్తే నియోజకవర్గంలో ఉన్న పలు డివిజన్ల పేరును మారుస్తానంటూ బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు. దీనికితోడు ఇది హిందూ, ముస్లింలకు మధ్య జరుగుతున్న ఎన్నికల యుద్ధంగా ఆయన అభివర్ణించారు. బిజెపికి జనసేన మద్దతు పలకడంతో కొత్త ఉత్సాహం వచ్చింది. యువత ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో తమకు ప్రధాన పోటీ కాంగ్రెస్ తోనేనని, ఇక్కడ గెలిచి తీరుతామని స్పష్టం చేస్తున్నారు. రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని మధ్యతరగతి ప్రజలను ప్రసన్నం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

**ఓటరు నిశ్శబ్ధం...**

ఒకవైపు పార్టీలు ప్రచారంతో దూసుకెళ్లినప్పటికీ నియోజక వర్గ ఓటరు ఇంకా నిశ్శబ్ధంగానే ఉన్నారు. ఓటరు ఎటు ఓటు వేస్తాడనే విషయంలో ఏ పార్టీకి స్పష్టత రాకపోవడంతో కొంత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు అవసరమైన ప్రయత్నాలు అన్ని చేశారు. ఈ నెల 11న ఓటర్లు తీర్పు వేసేందుకు ఎటు ఓటు వేస్తారనే విషయంలో వారికి స్పష్టత రావడం లేదు. గత ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ప్రధాన పార్టీ హవా ఉన్నప్పటికి, నగరంలో ఫలితాలు వైవిధ్యంగా వచ్చాయి. ఈ క్రమంలోనే ఓటరు నిశ్శబ్దంపై పార్టీలు ఆందోళనకు గురవుతున్నాయి. కొన్ని అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీలు రాజకీయ నాయకులు పెట్టే ప్రలో భాలకు లొంగకపోవడం, తాము ఓటు హక్కును వినియోగించుకుంటామని తేల్చిచెబుతున్నప్పటికి వారి ఓటు ఎటు వెళ్తుందోననే భయం రాజకీయ పార్టీలను వెంటాడుతోంది. మరోవైపు స్వతంత్ర పార్టీలవల్ల పెద్దగా ప్రమాదం ఉండదని ప్రధాన రాజకీయ పార్టీలు భావిస్తున్నప్పటికీ వారు ఎవరికి అనుకూలంగా ఓటు వేయిస్తారా అనేది అర్థం కాని ప్రశ్నగా మారింది.

**ఓటింగ్ శాతం పెంచేందుకు...**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల సమ యంలో 45 నుంచి 50 శాతం మధ్యలోనే పోలింగ్ నమోదవుతూ వస్తుంది. అయితే ఈసారి ఓటు శాతాన్ని పెంచేందుకు ఎన్నికల అధికారులు అవసరమైన కసరత్తులు చేశారు. వివిధ ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓట్ ఫర్ ష్యూర్, హోం ఓటింగ్ తదితర అంశాలను ప్రధానంగా ప్రచారం చేశాయి. కొత్త ఓటర్ల నమో దుకు అవకాశం కల్పించాయి. మరోవైపు దొంగ ఓట్ల వ్యవహారంపై వచ్చిన ఆరోపణల నేపథ్యం లోనూ విచారణ చేపట్టి ఎలాంటి దొంగ ఓట్లు లేవని సైతం తేల్చిచెప్పింది.

**పోలింగ్‌కు సన్నాహాలు...**

ఎన్నికల అధికారులు పోలింగ్‌కు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో డీఆర్‌ఎసీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మూడంచల భద్రతను ఏర్పాటు చేశారు. రౌడీషీటర్లపై నిఘా పెట్టి ఇప్పటికే వారిని బైండోవర్ చేశారు. నగర ప్రశాంతతను చెదరగొట్టే పోస్టులు, ప్రచారాలను సామాజిక మాధ్యమాల్లో చేసే వారిని ఉపేక్షించబోమని ఇప్పటికే నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ తేల్చిచెప్పారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మద్యం విక్రయాలపై నిషేధం విధిం చారు. ఓట్ల లెక్కింపు ముగిసి ఫలితాలు వెల్లడించే వరకు పహారాకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాయి. ఇందుకోసం డ్రోన్లు, సీసీటీవీ కెమోరా లను సైతం వినియోగిస్తున్నారు. కర్రలు, లాఠీలు, జెండాలు చేతపట్టి తిరగరాదని, పోలింగ్ స్టేషన్లకు 200ల మీటర్ల లోపు అయిదుగురు అంతకు మించి గుమిగూడటంపై నిషేధం విధించారు.



## సందర్శకులను ఆకట్టుకుంటున్న జీబ్రాలు

**చార్మినార్, నవంబరు 9 ప్రభాతవార్త:**

హైదరాబాద్ పాతబస్తీ బహ దూర్‌పుర శివారులోని నెహ్రూ జూలాజికల్ పార్కులో ఉన్న జీబ్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జూపార్కును తిలకించటానికి వచ్చే పర్యాటకులు మక్కువతో జీబ్రాలను తిలకిస్తుంటారు. జంతు మార్పిడిలో భాగంగా గుజరాత్‌లోని వంతరా జూపార్కు నుంచి ఒక ఆడ, రెండు మగ జీబ్రాలు అక్టోబరు నెలలో నెహ్రూ జూలాజికల్ పార్కుకు వచ్చాయి. మూడు జీబ్రాలను పర్యవేక్షణలో ఉంచిన అనంతరం జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లోకి అక్టోబరు ఏడవ తేదీన విడిచిపెట్టారు. జూ పార్కులో పులులు, సింహాలు, ఏనుగులుతోపాటు పలు రకాల జంతువులు,పక్షులు ఉన్నప్పటికి జీబ్రాలు లేవు. దాదాపు ముప్పై ఏడు సంవత్సరాలు తర్వాత జూ పార్కులో జీబ్రాలు కనిపిస్తున్నాయి. మూడు జీబ్రాలు జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లో ఉంటున్నాయి. జీబ్రాలు పచ్చిగడ్డి,ఆకులను ఆహారంగా ఎంతో ప్రీతితో తింటాయి.కాగా జూ పార్కు సిబ్బంది జీబ్రాలకు పలు రకాల పండ్లు,శెనగలు,పప్పులు ఆహారంగా అందిస్తారు.ఇరవై నుంచి ముప్పై సంవత్సరాలు మధ్య జీబ్రాలు జీవిస్తాయి.కాగా జూ పార్కులోని మూడు జీబ్రాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

## ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించిన ఎంపీ ఈటల

**కంటోన్మెంట్, నవంబరు 9 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలో నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించి, ఎంపీ ఈటల రాజేందర్ అధికారులకు తగు సూచనలు అందజేశారు. ప్యారడైజ్ సిగ్నల్ నుండి మేడ్చల్ వరకు నిర్మాణ పనులను,మరియు మంచి నీటి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తూ హెచ్ఎండిఎ అధికారి హరికృష్ణతో చర్చించారు. అలాగే రహదారుల మళ్లింపు, ట్రాఫిక్ సమస్యల పైన స్థానిక ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేతో చర్చించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానుక మల్లికార్జున్, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు కేశవ్ రెడ్డి, కంటోన్మెంట్ బీజేపీ నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

## వీకెండ్‌లో పోలీసుల సడన్ డ్రైవ్

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 529 మందిపై కేసులు**

**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త:** నగరంలో తాగి బండి నడిపే వాళ్ల తాటతీస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు.వీకెండ్‌లో నగరవ్యాప్తంగా రోడ్లపై తనిఖీలు చేసి జైలుకు పంపుతున్నారు. తాగి బండి నడిపివారికే కాదు, ఇతరులకు ప్రమాదంలో పడేలాచేస్తున్నారని, తాగి డ్రైవ్‌చేస్తే తీవ్రపరిణామాలుంటాయని అరెస్టులతో హెచ్చరిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ సిటీలో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు. తాగి డ్రైవ్ చేసిన మొత్తం 529 మందిని జైలుకు పంపారు. వీరిని కోర్టులో హాజరు పర్చనున్నారు. ఆదివారం సిటీలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 417 బైకులు, 24 ఆటోలు, 88 కార్లను పట్టుకున్నారు ట్రాఫిక్ పోలీసులు. తాగి వాహనాలు నడుపుతున్న 529 మందిపై బిఎన్ఎస్ చట్టం ప్రకారం 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్ ప్రకారం తాగి బండి నడిపిన వారికి గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించబడుతుందని పోలీసులు చెప్పారు. గత వారం కూడా తనిఖీ చేపట్టిన ట్రాఫిక్ పోలీసులు..357 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కోర్టులో డిస్పోజ్ చేశారు. అందులో మందిని కోర్టు గత వారంలో మొత్తం 357 డ్రంక్ డ్రైవింగ్ కేసులు కోర్టుల్లో హాజరపర్చగా వారిని 307 మంది జరిమానాతో బయటపడ్డారు. మిగతా వారికి జైలు శిక్ష పడింది.

# పెట్ డాగ్స్ ఇష్టమే

**◆లైసెన్సులకు మాత్రం నో..! ◆రిజిస్ట్రేషన్లు ఉచితమే అయినా 10 శాతం లేని లైసెన్సులు**



**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త**

గ్రేటర్ హైదరాబాద్లో జంతు ప్రేమికులెందరో ఉన్నారు. కుక్కలు, పిల్లులు, బాతులు తదితర జంతువులు, పక్షులను పెంచుకునేవారు ఎందరో ఉన్నారు. వీరిలో డాగ్ లవర్సే అత్యధికం. పెంపుడు కుక్కలను కుటుంబసభ్యులుగా, అల్లారుముద్దుగా పెంచుతూ, బర్త్‌డేలు ఇతరత్రా ఫంక్షన్లు సైతం నిర్వహిస్తుండటం తెలిసిందే. కుక్కలపై ఇంత శ్రద్ధ చూపుతున్న వారిలో చాలామంది వాటి వివరాలను మాత్రం జీహెచ్ఎంసీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సులు తీసుకోవడం లేదు. గతంలో ఇందుకు లైసెన్సు ఫీజు ఉన్నప్పటికీ, ఎక్కువమందిని ఆకర్షించేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ అవకాశాన్ని జీహెచ్ఎంసీ కల్పించింది. అంతేకాదు, జీహెచ్ఎంసీ కార్యాలయాల దాకా వెళ్లనవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే పొందే సదుపాయం కల్పించినా ప్రజల నుంచి స్పందన కనిపించడం లేదు. గ్రేటర్‌లో దాదాపు 1.50 లక్షల వరకు పెంపుడు కుక్కలుంటాయని అంచనా. వీరిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు 11 వేలు కూడా లేరు. అంటే.. పదిశాతం కూడా లేరు. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు పెంపుడు కుక్కలను కలిగిన వారు వాటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. నిర్ణీత వ్యవధుల్లో టీకాలు ఇప్పించాలి. డీవార్మింగ్ చేయించాలి. రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పొరపాటున పెంపుడు కుక్కలు తప్పిపోతే యజమానిని గుర్తించేందుకు వీలవుతుంది. రిజిస్ట్రేషన్ చేసుకొని, లైసెన్స్ పొందడం వల్ల చట్టపరమైన యాజమాన్య హక్కు లభిస్తుంది. యాజమాన్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కరించేందుకూ ఉపకరిస్తుంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న యజమానులకు కుక్కల సంరక్షణకు సంబంధించిన జాగ్రత్తలు, నిర్ణీత వ్యవధుల్లో టీకాలు ఇప్పించడం వంటివాటి గురించి జీహెచ్ఎంసీ మెసేజ్‌ల ద్వారా 'అలర్ట్' చేస్తుంది. సందర్భానుసారం సలహాలు, సూచనలు తెలియజేస్తుంది.

**ఇవీ బాధ్యతలు..**

* లైసెన్సులు పొందే యజమానులకు తగిన బాధ్యతలూ ఉన్నాయి. తగిన ఆహారం ఇవ్వాలి, ఆశ్రయం కల్పించాలి. వాటిపై క్రూరత్వం చూపొద్దు. వాటివల్ల ఇతరుల ఆరోగ్యానికి ప్రమాద కర పరిస్థితి ఎదురైతే లైసెన్సును రద్దు చేస్తారు.

* పెంపుడు జంతువుకు మంచి ఆరోగ్యం ఉండేలా. చూడాలి. సకాలంలో యాంటీ రేబీస్ టీకాలు, ఇతర రోగనిరోధక టీకాలు వేయించాలి. రిజిస్ట్రేషన్ సందర్భంగా తప్పుడు వివరాలు నమోదు చేస్తే, వాటిని గుర్తించినప్పుడు లైసెన్సు రద్దవుతుంది.

* పెంపుడుకుక్కలను బయటకు తీసుకువెళ్లేటప్పుడు వాటి లైసెన్సు (రిజిస్ట్రేషన్) ప్రతిని యజమానులు వెంట ఉంచుకోవాలి.

* కుక్కల మెడకు పట్టీ ఉంచాలి. బహిరంగ ప్రదేశాల్లో వదిలిపెట్టరాదు.

* బహిరంగ ప్రదేశంలో పెంపుడు కుక్కలు మలవిసర్జన చేయకుండా జాగ్రత్త వహించాలి. ఒకవేళ అలా చేస్తే ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచే బాధ్యత యజమానిదే.

* యజమాని అందించిన సమాచారం మేరకు లైసెన్స్ జారీచేస్తారు. అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా యజమాని నడుచుకోవాలి.

* బహుశా, ఇన్ని నిబంధనలుండటం వల్లే చాలామంది పెంపుడు కుక్కలను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని సందర్శించిన థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు

**హైదరాబాద్ నవంబరు 9, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధవనాన్ని థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు ఆదివారం మహాబోధి విహార సికింద్రాబాద్, సాయంత్రం హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని సందర్శించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని సిద్ధార్థ బుద్ధ విహార నుండి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహాన్ని సందర్శించారు. గగన్‌మాలిక్ ఫౌం డేషన్, గుల్బర్గా సిద్ధార్థ బౌద్ధ విహార సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి దమ్మయాత్ర కోసం ఈ బృందం తెలంగాణాకు వచ్చారు, వీరికి బుద్ధవనం ఆర్ట్స్ ప్రమోషన్ మేనేజర్ శ్యాంసుందర్రావు బౌద్ధవారసత్వ విశేషాలను, తెలియజేశారు. బౌద్ధభిక్షువులు హుస్సేన్‌సాగర్ బుద్ధ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ వందనం సమర్పించారు.అనంతరం పబ్లిక్ గార్డెన్ స్టేట్ మ్యూజియంలో బౌద్ధదాతువులను వీక్షించారు, నగర నడిబొడ్డున ప్రశాంత వాతావరణంలో, చారిత్రక హుస్సేన్ సాగర్‌లో అలనాటి బౌద్ధ వారసత్వాన్ని ఈ బుద్ధుని సందర్శించడం భవిష్యత్ తరాలకు ప్రేరణ కలిగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. దక్షి ణ భారతంలో తెలంగాణ ప్రపంచ బౌద్ధ బిక్షువులకు బుద్ధవనం, హుస్సేన్‌సాగర్ బుద్ధ, ఇతర బౌద్ధప్రదేశాలుకలిపి పర్యాటకంగా అభివృద్ధి చేస్తే, బౌద్ధ పర్యాటకులకు ఆరాధన కేంద్రాలుగా విలసిల్లగలవని వారు పేర్కొన్నారు. ఈ సందర్భం గా బుద్ధ ధర్మం గురించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో గుల్బర్గా నుండి వచ్చిన థాయిలాండ్, కంభోడియా, యుఎస్ఏ, భారతదేశానికి చెందిన బౌద్ధ బిక్షులు, ఉపాసకులు పాల్గొన్నారు. వీరిలో థాయిలాండ్ ఉపాసిక లిథ, బుద్ధ విహార గుల్బర్గా నుండి రతన జ్యోతో తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో పాల్గొన్న అఖిల భారత బ్రహ్మసమాజ్ సభ్యులు

## ముగిసిన అఖిల భారత బ్రహ్మసమాజ్ సమావేశం

**హైదరాబాద్ నవంబరు 9, ప్రభాతవార్త:** కాచిగూడ మున్నూరు కాపు భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన 134వ అఖిల భారత బ్రహ్మ సమాజ్ సమావేశం ఆదివారం ముగిసింది. హైదరాబాద్ దక్కన్ బ్రహ్మ సమాజ్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. వేదపారాయణం, ఆధ్యాత్మిక ప్రసంగాలతో సభికులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గోపిచందా మాట్లాడుతూ భగవం తుడితో స్నేహం అనేది మానవుడికి లభించిన అత్యంత వరం అన్నారు. కల్యాణి చటోపాధ్యాయ రాజారామ్మోహన్ వంటి మహనీయుల ఆధ్యా త్మిక సేవలు నేటితరానికి మార్గదర్శకం అన్నారు. మరో ఆధ్యాత్మికు రాలు మధుబిందు మాట్లాడుతూ జీవితంలో కృతజ్ఞత, ఆత్మజ్ఞానం విలువల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రేఖాసహాని మాట్లాడుతూ యువత సమాజ సేవలో భాగస్వాము కావా లన్నారు. వేదభ్యాసం అందరికి అందుబాబులో ఉండేలా దక్కన్ బ్రహ్మ సమాజ్ కృషి చేస్తుండన్నారు. ఈ సందర్భంగా శ్రీరధి శంకర్ కథాకథన కార్యక్రమం అందరినీ అకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఏ.వి.లక్ష్మీ నారాయణ, దాసరీ భారతప్రసాద్‌లు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోష్ణ, డాక్టర్ నిమేష్ ప్రభు.ఆత్మీ, డాక్టర్ కుమార్ డాక్టర్ టారాబాద్ చెన్నప్రత సర్కార్ సర్వేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**కెవైసిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే నరసింహ కురుమ**


మాట్లాడుతున్న గొరిగే నరసింహ కురుమ

**చిక్కడపల్లి నవంబరు 9 ప్రభాతవార్త:** కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే నరసింహ కురుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురుమ యువ చైతన్య(కెవైసిఎస్) ఆరవ వార్షికోత్సవం ఆదివారం బాగ్‌లింగం పల్లి సుందరయ్య విజ్ఞానం కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గురిగి నరసింహ కురుమ మాట్లాడుతూ కురుమల హక్కుల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కురుమ జనాభా దామాషా అన్ని పార్టీలు తమకు రాజకియ ప్రాతినిధ్యం ఇవ్వాలని అన్నారు. ట్యాంక్ బండ్ పై దొడ్డి కుమరయ్య విగ్రహం ఏర్పాటు చేయా లని, జనగామ జిల్లాకు దొడ్డి కుమరయ్య పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మె మహేందర్ కుమార్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ కురుమ, కోఆర్డినేటర్ కామగంటి వెంకటేష్ కురుమ, నాయకుడు గౌడ రాజ్ కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీ శైలు, వివిధ జిల్లాల అధ్యక్షులు నీళ్ల రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతినగర్‌లో కార్తీకమాస వనమహోత్సవం

**పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ**



వన మహోత్సవంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

**నిజాంపేట్, నవంబరు 9, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ బావర్చి కమాన్ వద్ద కాపు సంఘం ఏర్పాటు చేసిన కార్తీకమాస వనభోజన కార్యక్రమం లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగవీటి రంగ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ కాపు సంఘం వారు ఐక్యతతో ఏర్పాటు చేసుకున్న ఈ కార్తీక మాస వనభోజనాల కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ కోఆప్షన్ సభ్యులు చంద్రగిరి సతీశ్, సంఘ సభ్యులు ముద్రగల్ల ప్రసాద్, పంతం పవన్ నాయుడు, కొనాపేరెడ్డి వెంకటరావు, పీవి సత్యనారాయణ, బోనం నాయుడు పోతుల రాంబాబు, గొర్రెల దొరబాబు, పిండి చిన్న, ఆకుల చంటి, కల్లూరి నరేంద్ర, పోలిశెట్టి దుర్గ రావు, మరెళ్ల శివ రామకృష్ణ, శ్రీనువాసు, గోలి సోడా సుబ్బు, నంబూ సత్య సాయి, రంజిత్, కాపు సంఘం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుకు పకడ్బందీ ప్రణాళిక

**ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**జూబ్లీహిల్స్, నవంబరు 9, ప్రభాతవార్త :** నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుపడేందుకు మెరుగైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అన్నివర్గాలు కాంగ్రెస్ వైపే చూస్తు న్నాయని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని సోమాజిగూడ డివిజన్ పరిధి లోని వివిధ కాలనీలు, బస్తీల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ఆయన ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నగరాభివృద్ధికి గత కాంగ్రెస్ ప్రభు త్వాలు తీసుకున్న చర్యలు, చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల గురించి ఓటర్లకు వివరించారు. నగరాభివృద్ధికి, స్థానిక సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన భవిష్యత్తు కార్యాచరణపై సలహాలు సూచనలు స్వీక రించారు. బీఆర్ ఎస్ చెబుతున్న అభివృద్ధి క్షేత్రస్థాయిలో వాస్తవ పరి స్థితి వేరని అన్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ బురద జల్లే రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. పదే పదే కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాస్తవాలను ప్రచారం చేస్తూ ఈ ఉప ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీఆర్ ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని పునరుద్ఘా టించారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని జూబ్లీహిల్స్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా ముందుకు సాగుతున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

# సమాచార హక్కును పాఠ్యాంశాలల్లో చేర్చాలి

## రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్



సభలో ప్రసంగిస్తున్న దేశాల భూపాల్. చిత్రంలో చంటిముదిరాజ్, సూర ప్రవంతి తదితరులు

**సైఫాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త:** సమాచార హక్కుపై అందరికి అవగాహన కలి గేందుకు పాఠ్యాంశాల్లో చేర్చాలని రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్ చెప్పారు. ఇందుకోసం తమ వంతు కృషి జరుగుతున్నదన్నారు. గత ప్రభు త్వం రెండున్నరసంవత్సరాలుగా సమాచార హక్కు కమిషన్‌కు కమీషనర్‌లను నియమించకపోవడంతో 18 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, తాము వచ్చిన తరువాత 5,6 వేల కేసులను పరిష్కారించ డం జరిగిందన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రథమ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజల్లో పూర్తిగా అవగాహన కల్పిం చాలని, ఇందుకోసం సాధన కమిటీ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. మానవుడు తన కోసం బ్రతకడం కాదని, సమాజం కోసం బ్రతకాలని, సమాజంలో ఆనేక మార్పులు వస్తున్నాయని, ఈ మార్పులను అవగాహన చేసుకోవాలని, జ్ఞానాన్ని పెంచుకుని తన జీవితాన్ని సార్థకతం చేసుకోవాలని ఆయన సూచించారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డా.చంటిముది రాజ్, రాష్ట్ర అధ్యక్షురాల సూర ప్రవంతి మాట్లా డుతూ తమ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శక పాలన కోసం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. మన లక్ష్యం-ప్రజలకు దగ్గర కావాలని, ప్రతి పౌరుడు తన హక్కును తెలుసు కోవాలని, పారదర్శకత ప్రజాస్వామ్యానికి ప్రాణం కావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, ఆలస్యం, లంచగొండితనం వంటి అంశాలపై ఆర్‌టిఐకి దరఖాస్తులు సమర్పించామన్నారు. త్వరలో ప్రతి జిల్లాలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం, యువతను సమాచార హక్కు ఉద్యమంలో భాగ స్వామ్యం చేయడం, ప్రజలకు పారదర్శక సేవలు అందించడంలో ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా నిలపడం తమ లక్ష్యమన్నారు. సభలో కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల రాఘవేందర్, అధికార ప్రతినిధి కాశీ సతీష్‌కుమార్, కార్యదర్శి కడమంచి అజయ్‌కుమార్, సినీ నటుడు కిరణ్, రాజశేఖర్, రామకృష్ణ, మల్లేష్, రమశ్రీ, సౌజన్య, ప్రియ, ప్రవీణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎలనాగకు సాహితీసేవా పురస్కారం బహూకరిస్తున్న నిత్యానందరావు

## నిబద్ధతకు మారుపేరునరసింహారావు

**ఆచార్య వెలుదండ నిత్యానందరావు**

**నాంపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త :** నిబద్ధతకు మారుపేరు, రాగద్వేషా లకు అతీతం డా. ఎం.ఎల్.నరసింహారావు అని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. అపురూప సాహితీభాండాగారమైన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయానికి 50ఏళ్లపాటు కార్యదర్శిగా సేవలందించడం చరిత్రలో లిఖించదగ్గ విశేషమని అన్నారు. ప్రముఖ రచయిత, కవి, అనువాదకుడు ఎలనాగకు ఎం.ఎల్. నరసింహారావు సాహితీసేవా పురస్కారం బహూకరించడం భాషానిలయ గొప్పదనానికి నిదర్శనమని, ఎలనాగకు శుభాభినందనలు తెలిపారు. డా. ఎం.ఎల్.నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ప్రముఖ రచయిత,కవి, అనువాదకుడు ఎలనాగకు డా. ఎం.ఎల్.నరసింహారావు సాహితీ సేవాపురస్కా రం బహూకరించారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు నిర్వహణ తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, తెలుగు భాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి అధ్యక్షతన ఆదివారం రాత్రి భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభావేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆచార్య వెలుదండ నిత్యానందరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆత్మీయ అతిథులు ఓయు విశ్రాంతాచార్యుడు డా. మసన చెన్నప్ప, శ్రీనివాస రావు తదితరులతో కలిసి ఎలనాగను ఘనంగా సత్కరించి సాహితీ సేవా పురస్కారం బహూకరించి శుభాభినందనలు తెలిపారు. ముందుగా టి.ఉదయ వర్లు స్వాగతోపన్యాసంలో తరతరాల తెలుగుజాతి వైభవానికి మచ్చుతునక, సాంస్కృతిక సంస్కృతికి కూడలి, అపూర్వ ఆధునిక దేవాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయమని, దీనికి డా. ఎం.ఎల్.నరసింహారావు 5దశాబ్దాలపాటు కార్యదర్శిగా సేవలందించారని వివరించారు. 2016 నుండి ఆయన పేరున సాహితీసేవా పురస్కారం ఏర్పాటుచేసి నేటి వరకు ప్రతీసంవత్సరం ఈ పురస్కారం ప్రదానం చేస్తూనే ఉన్నట్లు విశదీకరించారు. డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో ఎంఎల్.నరసింహారావు సాహితీసేవనే కాకుండా ముఖ్యంగా భాషానిలయమనే ఈ ఖండాగారాన్ని కాపాడడం ఆయన చేసిన గొప్ప అపారమైన సాహితీసేవని కొనియాడారు. ఎలనాగకు నరసింహారావు సాహితీసేవా పురస్కారమివ్వడం ఎంతో సబబుగా ఉందని, ఎలనాగకు శుభాకాంక్షలు తెలిపారు.

## పద్మశ్రీ డాక్టర్ దత్తాత్రేయుడు నోరికి ఉప్పల సత్కారం

**ఎల్.బి.నగర్, నవంబరు 9 ప్రభాతవార్త:** పద్మశ్రీ డాక్టర్ దత్తాత్రేయుడు నోరిని బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి, ఏపి సిఎం చంద్రబాబునాయుడు కేన్సర్ సేవల కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి అడ్వైజరీగా మరో ప్రతిష్ఠాత్మక నియామకం పొందినందుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలుగింటి బిడ్డ హైదరా బాద్‌లో విద్యాభ్యాసం చేసి అందరికి ఆదర్శంగా నిలిచి అసాధారణ నైపుణ్యం, నిస్వార్థ సేవాభావం, జీవితాంతం కేన్సర్‌పై పోరాడుతూ ప్రాణాలను రక్షించాలనే మీ తపనకు ప్రతీక అని ఆయన అన్నారు.మీ నాయకత్వం రెండు తెలుగు రాష్ట్రాల్లో కేన్సర్ సేవల భవిష్యత్తును నిశ్చయంగా మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని ఈ మహత్తర దౌత్యంలో మీకు నిరంతర శక్తి, ఆరోగ్యం, మరిన్ని విజయాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆయన కోరారు.

## ఘనంగా కార్తీక సమారాధన

**సరూర్‌నగర్, నవంబరు 9 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డు కొండానగర్ హిల్స్‌లో ఆదివారం మీర్‌పేట్ శ్రీ గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమారాధన/కార్తీక వన భోజన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సంఘ ఆధ్వర్యంలో 25వ కార్తీక మాస విశేష పూజల్లో భాగంగా కొండానగర్ హిల్స్‌లోని సంఘానికి చెందిన స్వంత భూమిలో గణపతి పూజ, సత్యనారాయణ స్వామి వ్రతం, గోపూజ, సువాసినిలచే కుంకుమార్చన, సహస్ర లింగార్చన, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతీ పరమేశ్వర దివ్య కళ్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో గాయత్రీ సేవా సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీకమాస వనభోజన మహోత్సవం

**ఎల్.బి.నగర్, నవంబరు 9 ప్రభాతవార్త:** కార్తీకమాసం వనభోజనంతో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నాగోల్ డివిజన్ పరిధిలో గౌరెల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వాసవీఅన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతీదులుగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ సతీమణి జమున, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, డిసిపి కోటేశ్వరరావు, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రయాదవ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు. వనభోజనం కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు అశోక్, జంగయ్య, అనిల్‌కుమార్, వెంకటరమణ, దినేష్, మునేందర్, సాయికృష్ణ, సూర్యప్రకాష్, అమర్, నరసయ్య, రామారావు, మల్లికార్జునరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాన్ని కాపాడాలి

**కాలనీ సంక్షేమ సంఘం**

**సరూర్‌నగర్, నవంబరు 9 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరే షన్ 4వ డివిజన్ అల్మాస్‌గూడ న్యూ మధురాపురి కాలనీలో పార్కు స్థలాన్ని కాపాడాలని స్థానిక కాలనీ సంక్షేమ సంఘం అధికారులను, ప్రజాప్రతినిధు లను కోరింది. ఆదివారం సమావేశమైన సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు పార్కు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గతంలో స్థానికంగా ఉన్న దేవాలయ ప్రాంగణం, బావి ప్రదేశాన్ని వివిధ కాలనీల ప్రజల సౌకర్యార్థం పార్కు స్థలంగా గుర్తించడం జరిగిందని తెలిపారు. అప్పట్లో పార్కు అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే కూడా హామీనిచ్చారని వారు గుర్తు చేశారు. అయితే కాల క్రమేణా ఆ ప్రదేశంలో దాదాపు సగ భాగం ఆక్రమణలకు గురవుతూ అక్రమ నిర్మాణాలు జరుగు తుండడంతో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని వారు వెల్లడించారు. పార్కు స్థలాన్ని కాపాడుతామని అధికారులు హామీనిచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవాలయ ప్రాంగణ ప్రదేశం, పార్కు స్థలాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ మధురాపురి కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ళ నవీన్‌కుమార్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు తాదూరి వెంకటరమణ, గౌరవ అధ్యక్షుడు ఏమిరెడ్డి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముక్తా రేవంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కోట్ల అశోక్‌కుమార్, కోశాధికారి సిహెచ్ ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శి ఎ.బల్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామచంద్రస్వామి ఆలయంలో సహస్ర లింగార్చన

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని ప్రసిద్ధి శ్రీ రామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం అన్నకోటి, సహస్ర లింగార్చన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం విశేష పూజా కార్యక్రమా లలో భాగంగా శ్రీ రామ లింగేశ్వర స్వామికి సహస్ర లింగార్చన, శ్రీ హరి హర అయ్యప్పస్వామి పడి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు ప్రసాద్ శర్మ, విజయేంద్ర హరీష్ కుమార్ శర్మ, అక్షయ్ శర్మ, గురు స్వామి శ్రీకరం సేవా సమితి అధ్యక్షుడు దేవిప్రసన్న శర్మ ఆధ్వర్యంలో పూజలు వైభవంగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, నిత్య రుద్రహోమం, మహాన్యాసం, మృతికా మిశ్రణం,ం సహస్ర లింగ సృష్టి, అన్నాభిషేకం, సహస్ర లింగార్చన, అయ్యప్పస్వామి పడిపూజ, మహా మంగళహారతి, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ పండితులు మాట్లాడుతూ అరుద్ర నక్షత్రం రోజున జరిగే అన్నదానం కార్యక్రమం ఎంతో విశిష్టమైనదని, అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :**

ఉప్పల్ ఎన్‌జిఆర్ఐ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి కడాలి వెంకన్న, ఆలయ అర్చకులు గంభీరపురం రవీంద్ర శర్మ, జోషి సంతోష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాస ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజ కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని వారు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పలువురు భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# భాగస్వామిని ఎంచుకునే హక్కు రాజ్యాంగం కల్పించింది

## జస్టిస్ రాధారాణి


కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ రాధారాణి, జస్టిస్ రజని తదితరులు

**చిక్కడపల్లి నవంబరు 9(ప్రభాతవార్త):** ఎవరైనా తమ భాగస్వామిని ఎంచుకునే హక్కును రాజ్యాం గం కల్పించిందని దాన్ని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కుల నిర్మూలన సంఘం ఆధ్వ ర్యంలో చేయన్ 2025 జాతీయ సదస్సు జరి గింది. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ... కులాంతర వివాహం చేసుకున్న వారికి సొంత కుటుంబంతోపాటు సమా జం నుంచి కూడా ఒకేసారి దాడి జరుగుతుందని అన్నారు. రాజ్యాంగాన్ని దిక్కరించి దాడులు జరగ డం బాధకరమన్నారు.మన విద్యావ్యవస్థలో మార్పు వచ్చినప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తానే మెరుగైన సమాజానికి దోహదరపడుతుందన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని మాట్లాడుతూ, మనుధర్మం సమానత్వాన్ని నిషేధించిందని అన్నారు. మనుషులనుబట్టి కాకుండా కులాన్ని బట్టి గౌరవిస్తు న్నారని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారని అన్నారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని పెంచాలని సూచించారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు రావాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడ లేని కుల వ్యవస్థ భారతదేశంలో ఉందన్నారు. ఒకరు ఎక్కువ మరోకరిని తక్కువ చూసే ధోరణిపోవాల న్నారు. రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించిన ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కులరహిత సమాజం కోసం పనిచేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు. అనం తరం చేయన్ సావనీరుతోపాటు మిత్ర రచించిన ప్రేమ కరువయే పాటల సిడిని ఆవిష్కరించారు. కుల నిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండి వాహిద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అరుణోదయ సమైక్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు డి.హనుమంతరావు, ఎన్. స్వరాజ్యలక్ష్మీ, డీఎల్ కృష్ణచంద్, డాక్టర్ ఈ సూర్య నారాయణ, ఎంఎన్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ బైరు నరేష్, సజయ పాల్గొని ప్రసంగించారు.


భెల్ ఆర్యవైశ్య వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఎపి మంత్రి టీజీ భరత్, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, తదితరులు

## వనభోజనాలతో ఐక్యత,స్నేహభావం పెంపొందుతాయి

**శేరిలింగంపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త :** కార్తీక మాస వన భోజన సమారాధానోత్సవాలతో బంధువుల్లో ఆత్మీయత, ఐక్యత, స్నేహభావం పెంపొందుతాయని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. బీహెచ్ ఈఎల్ ప్రభుత్వ కళాశాలలో తెలంగాణ శ్రీవాసవీ,ఆర్యవైశ్య ఐక్యవేదిక,భెల్ ఓబీసీ అసోసియేషన్ కార్యాలయం వద్ద గోకుల్ కల్చరల్ వెల్ఫేర్ అసోసి యేషన్ యాదవ సంఘం, వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో నిర్వహిం చిన కార్తీక మాస వనభోజన సమారాధన కార్యక్రమాలలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య వన భోజన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మంత్రి టీజీ భరత్ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. వివిధ సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక వన బోజనాల కార్యక్రమ సమావేశంలో కార్పొ రేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ఒకే చోట బంధువులంతా సామూహిక భోజనాలు చేయటం అభినందనీయమన్నారు. చెట్లనీడలో భోజనం చేయటం ద్వారా ప్రకృతితో మనకున్న బంధాన్ని గుర్తు చేసు కుంటా మన్నారు బంధువులు, స్నేహితులు సంఘ సభ్యుల మధ్య ఐక్యత సంతోషాలను పెంపొందించుకుంటామన్నారు. ప్రకృతిని కాపాడుకోవడంతో పాటు పిల్లలకు సంస్కృతిని, సంప్రదాయాలను పరిచయం చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంజీరా గ్రూప్ ఛైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల యోగానంద్, సురేశ్ కుమార్‌యాదవ్,సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, నటరాజ్, మల్లేశ్,శ్రీనివాస్, సత్యం, వినయ్, పలువురు ప్రముఖులు, తెలంగాణ శ్రీవాసవి ఆర్యవైశ్య ఐక్యవేదిక,గోకుల్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ భెల్ యాదవ సంఘం సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

**సైఫాబాద్, నవంరు 9 ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని డబుల్‌బెడ్ రూమ్‌లో నివసిస్తున్న ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి డబుల్‌బెడ్‌రూమ్ జెఏసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు పలుమార్లు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించు కోవడం లేదని, చివరికి జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చి అమలు చేయలేకపోయా రని జెఏసి నాయకులు ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఏసి కన్వీనర్ సన్‌దీప్, నాయ కులు నర్సింగ్‌రావు, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ గత కొన్ని సంవ త్సరాలుగా కాలనీ వాసులు మంచినీటిని ఖరీదు చేసుకుని తాగుతున్నారని, వీధి దీపాలకు సొంత డబ్బులు ఖర్చుచేసుకుంటున్నారని, కరెంట్ బిల్లులు, పార్క్ తదితరులకు నెలకు 3 వేల నుంచి 5 వేల వరకు ఖర్చు అవుతున్న దని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కారించక పోతే ఇందిరాపార్కు ఎదుట ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

## విజయవంతంగా ముగిసిన మాయావినోదం

**రవీంద్రభారతి, నవంబరు 9 ప్రభాతవార్త:**

ప్రఖ్యాత కిన్నెర 48వ వార్షిక వారోత్సవాల సందర్భంగా 3రోజులపాటు నిర్వహించిన మాయావినోదం బి.వి.పట్టాభిరామ్‌కు అంకితమివ్వడం ఎంతో అపూర్వ, సబబని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యం లో కిన్నెర 48వ వార్షిక వారోత్సవాల్లో భాగంగా 3రోజుల మాయా వినోదం; నాటకోత్సవాల్లో మూడవ చివరిరోజు ఆదివారం రాత్రి రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో జరిగిన మాయావినోదం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు డా. గుమ్మడి గోపాలకృష్ణ, గౌరవ అతిథులు ఇంద్రజాలకుడు సామల వేణు, మిమిక్రీ సిహెచ్.శ్రీనివాస్, మైమ్ మధు, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, వెంకటరమణ, జివిఎన్. రాజు, మల్లం రమేష్ తదితరులతో కలిసి ముందుగా బి.వి.పట్టాభిరామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘననివాళులర్పించారు. అనంతరం నేటి మాయావినోదంలో అద్భుత ప్రదర్శనలిచ్చిన 21మంది మిమిక్రీ, మేజిక్, మైమ్ కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు. నేటి 3రోజుల మాయావినోదం ముగిసినట్లు, రేపటి నుండి 4రోజులపాటు రాత్రి 6గంటల నుండి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో నాటకోత్సవాలు జరగనున్నట్లు కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ తెలిపారు.

## రైలులో ప్రయాణికుడి బ్యాగు చోరీ

**12 గ్రాముల బంగారుగాజులు, రూ. వెయ్యి నగదు అపహరణ**

**హైదరాబాద్ నవంబరు 9, ప్రభాతవార్త :** రైలు ప్రయాణికుడి బంగారు గాజులను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం..కందికొల్ల వినయకుమార్ రేణిగుంటలో చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి నగరానికి వస్తున్నాడు. రాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో లగేజ్ బ్యాగును సీటుపై ఉంచి బాత్రూమ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బ్యాగు కనిపించలేదు. ఆ బ్యాగులో 12 గ్రాముల బంగారు గాజులు, వెయ్యి రూపాయల నగదు, డెబిట్ కార్డులు ఉన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఎల్లయ్య తెలిపారు.

## ఉప్పల్‌లో మసాజ్ సెంటర్లపై పోలీసుల దాడులు

**ఇద్దరి అరెస్ట్... సీజ్ చేసిన అధికారులు**

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా మసాజ్ సెంటర్లపై పోలీసులు దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ఏసియన్ థియేటర్ ఎదురుగా అవాసా వెల్‌నెస్ సెంటర్ పేరుతో స్పా నిర్వహిస్తున్నారని పోలీసులు తెలిపారు. దీంతోపాటు నాగోల్ మెట్రో స్టేషన్ సమీపంలో హైఫైస్పా పేరుతో మరో మసాజ్ సెంటర్ నడిపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో ఆదివారం మల్కాజిగిరి ఎస్‌ఓటి పోలీసులు, ఉప్పల్ పోలీసులు సంయుక్తంగా సెంటర్‌లపై దాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మహిళలతో స్పా సెంటర్ నిర్వహిస్తున్నారని, నిర్వాహకులు అవాసా వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు మహ్మద్ నాదవ్, హై ఫై స్పా నిర్వాహకులు ధశరద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలనగర్‌లో వీధి కుక్కల స్వైర విహారం...

**పారిశుధ్య కార్మికులతో పాటు 20 మందిని కరిచిన కుక్కలు**

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబరు 9, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజక వర్గం పరిధిలోని బాలానగర్ ప్రాంతంలో పలుకాలనీలు, బస్తీల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఆదివారం ఉదయం పలు ప్రాంతాలలో గుంపులుగా ఉన్న కుక్కలు పారిశుధ్య కార్మికులపై, నడుచుకుంటూ వెళు తున్న మహిళలపై దాడి చేశాయి. సంఘటనలో దాదాపు 20 మందికి పైగా కుక్కల దాడిలో గాయపడినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో వీధి కుక్కలు చాలా మందిని కరుస్తున్నాయి. ఉదయం 7 గంటల సమయంలో జి.హెచ్.ఎం.సి మహిళా కార్మికులను చాలా ఘోరంగా కరిచాయి. ముఖ్యంగా ఉదయాన్నే ఈ వీధి కుక్కలు కరవడానికి సిద్ధమవు తున్నాయనీ స్థానికులు పేర్కొంటున్నారు. బాలానగర్ ప్రాంతంలో ఎక్కువ సంఖ్యలో గ్రామ సింహాలు తిరుగుతున్నాయని మున్సిపల్ అధికారులు వెంటనే వాటిని బంధించి దూర ప్రాంతాల్లో వదలాలని కోరుతున్నారు.


కుక్క గాట్లు



జ్యోతి ప్రజ్వలన చేసిన గోపాలకృష్ణ, డీజీపి శివధర్‌రెడ్డి తదితరులు

## వైభవంగా సికా స్వర్ణోత్సవ వేడుకలు

**నాంపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త :** కాస్మోపాలిటన్ ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్(సికా) హైదరాబాద్ 50వ సంవత్సర స్వర్ణోత్సవ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఈమేరకు నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారకరామారావు కళా వేదికలో ప్రారంభమైన ఈ స్వర్ణోత్సవ వేడుకలకు భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి,గ్రామీణ విద్యుద్దీకరణ కార్పొరేషన్ లిమిటెడ్‌నసిఎండి ఎం.గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథిగా తెలంగాణ డీజీపి బి.శివధర్‌రెడ్డి, గౌరవ అతిథులుగా సంస్థ అధ్యక్షుడు సిఎస్‌టి.అనిల్‌కుమార్, కార్యదర్శి సి.రామారావు, కోశాధికారి కృష్ణ, వ్యవస్థాపక కార్యదర్శి యు.గోపాలకృష్ణ, మృణాళినిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించి సంస్థ చేస్తున్న సేవాకార్యక్రమాలను ప్రశంసించారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా అనన్య కూచిపూడి నృత్యం, కె.వి.రావు, స్వర్ణల సినీసంగీత విభావరి, సి.రవిచంద్ర మేజిక్ షో తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా సంస్థ సావనీర్ ఆవిష్కరించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: మాజీ సర్పంచ్



సమావేశంలో మాట్లాడుతున్న కావలి గణేష్

**దుండిగల్, నవంబరు 9 ప్రభాతవార్త:** దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ డబుల్‌బెడ్‌రూమ్ కాలనీ 1వ బ్లాక్ లబ్ధిదారులు ఏర్పాటు చేసిన సమావేశానికి సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కావలి గణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో కాలనీలో మౌలిక సదుపాయాలు, వీధిదీపాలు, డ్రైనేజీ తదితర సౌకర్యాలు, సమస్యలపై కాలనీవాసులతో ఆయన చర్చించారు. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి వీలైనంత త్వరితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు నర్సింగ్‌రావు, సెక్రటరీ మజర్, వాపుల శ్రీనివాస్, దొంతి మహేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ప్రారంభం



సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ

**కంటోన్మెంట్, నవంబరు 9 ప్రభాతవార్త:** చిన్నకమేలలోని శ్రీహనుమాన్ టెంపుల్ యూత్ అసోసియేషన్, మహేష్, జోసెఫ్, శివ, అనిల్ కలిసి కొత్తగా ఆలయంలో, చుట్టూ సీసీ కెమెరాలు పెట్టించారు. తిరుమలగిరి ఏసీపీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీసీ చారి, రామకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, నవంబరు 9 ప్రభాతవార్త :** ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు అధికారులు క్రీడలకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేస్తూ క్రీడాకారులను ప్రోత్సహించాలని కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు,కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన్న ప్రతాప్ పేర్కొన్నారు. ఈనెల 17 నుండి 19వరకు సరూర్‌నగర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి తెలంగాణ ఇంటర్ స్కూల్ స్పోర్ట్స్ చాంపియన్షిప్ పోటీలు కుంచెట్టి క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ క్రీడా పోటీలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆదివారం బోయినపల్లిలోని బాపూజీ నగర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు విద్యార్థి దశలోనే ఆటలు అంటే మక్కువ పెంచుకోవాలని సూచించారు క్రీడలకు క్రీడాకారులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుంది అన్నారు. ప్రైవేట్ పాఠశాలలలో క్రీడలకు యాజమాన్యాలు బాధ్యత వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొంచెం స్పోర్ట్స్ డెవలప్మెంట్ సంస్థ చైర్మన్ మహేశ్వర్ భవాని ప్రసాద్ సెవెంత్ స్పోర్ట్స్ డైరెక్టర్ వెంకటేష్. ఫిజికల్ డైరెక్టర్ సుధీర్. ప్రేమ్ కుమార్ ముదిరాజ్. నరసింహ నరేందర్. తదితరులు పాల్గొన్నారు

## వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

**చార్మినార్, నవంబరు 9 ప్రభాతవార్త :** కార్తీక మాసం సందర్భంగా ఆదివారం చార్మినార్ సమీపంలోని శ్రీ బాలాజీ మందిరంలో బాలాజి సేవా సమితి ఆధ్వర్యంలో వైభవంగా అన్నకూట్ ప్రసాదం కార్యక్రమం జరిగింది. పాతబస్తీతో పాటు జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శ్రీ బాలాజీ మందిరంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మందిరంలో జరిగిన అన్నకూట్ ప్రసాదం కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.మందిరం కమిటి నిర్వాహకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు రాజు పిత్తి,శ్రీనివాస్ బన్సల్,మందిరం పూజారి శృంగారం ఆత్రేయ స్వామితో పాటు పలువురు పాల్గొన్నారు.



శ్రీ వెంకటేశ్వర స్వామి

# ధార్మిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారు

### ఎమ్మెల్యే తలసాని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట, నవంబరు 9, ప్రభాతవార్త :** సామాజిక ధార్మిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కులో ఆర్యవైశ్య గ్లోబల్ సీనియర్ సిటిజన్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన మహోత్సవానికి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఒకవైపు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తూనే మరోవైపు అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేపడతారని వివరించారు. అదే విధంగా దేవాలయాల నిర్మాణం, నిర్వహణ లోనూ ఆర్యవైశ్యుల భాగస్వామ్యం ఉంటుందో ఆ దేవాలయాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని శ్రీమహాకాళీ అమ్మవారి ఆలయం, గణేష్ ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ, కనకదుర్గమ్మ ఆలయాలలో తాను ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి కమిటీలలో ఆర్యవైశ్యులకు ప్రాతినిధ్యం కల్పించిన విషయాన్ని గుర్తు చేసారు. ప్రతి కార్తీక మాసంలో వన భోజనాల సందర్భంగా ఆర్యవైశ్యులంతా ఒకచోట కలుసుకోవడం ఎంతో సంతోషదాయకం అని చెప్పారు. ఆర్యవైశ్యులకు అన్నివేళలా అండగా ఉంటూ వచ్చానని, ఇక ముందు ఉంటానని ప్రకటించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బాబు రావు, రమణయ్య, రాఘవేంద్రరావు, దీపక్, రమేష్, ప్రకాశం, సంపత్, సతీష్ పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖ కొత్త నిబంధనలు... కాంట్రాక్టర్లకు తిప్పలు

### స్టోర్ మెటీరియల్, ఎల్‌సిల సమస్యలను పరిష్కరించాలి.. తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



మాట్లాడుతున్న నక్కాయాదగిరి, జిపిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 9,ప్రభాతవార్త:** విద్యుత్తుశాఖలో ఇటీవల ప్రవేశపెట్టిన నూతన నిబంధనలతో విద్యుత్ కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్కా యాదగిరి అన్నారు. స్టోర్స్‌లో మెటీరియల్ అందుబాటులోలేక, ఎల్‌సీలు ఇవ్వకపోవడంతో పనులన్నీ పెండింగ్‌లో పడుతున్నాయన్నారు. ఈమేరకు ఆదివారం తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు జిసి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున హాజరై ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు సూచనలు చేయాలని తీర్మానం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్నటువంటి తనిఖీ పద్ధతి చేసే కాంట్రాక్టర్లకు వారికి సెక్షన్ కాంట్రాక్టర్ విధానాన్ని ఇవ్వాలని, రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ విద్యుత్ శాఖ స్టోర్లలో మెటీరియల్స్ అందుబాటులో ఉంచటం లేదని, క్షేత్రస్థాయిలో పనులు చేసినా(లైన్ క్లియరెన్స్)లు ఇవ్వకపోవడంతో వినియోగదారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు చూడలేదని అప్పుడు ఎలాంటి సమస్యలు లేకుండా టెండర్లు ఇచ్చేవారని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగాఉన్న స్టోర్లలో ఒక సామగ్రి ఉంటే, మరొకటి ఉండటం లేదని దీని వల్ల కాంట్రాక్టర్లు సకాలంలో పనులను పూర్తిచేయకపోతున్నారన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ కాంట్రాక్టర్లు విద్యుత్తు పనులను పూర్తిచేయాలంటే ఎల్‌సి అతి పెద్ద సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నా టీజీఎస్ పీడీసీఎల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ఎలక్ట్రికల్ కాంట్రాక్టులు మాన సికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తమ సమస్యలను గుర్తించి ఎల్‌సిలు, స్టోర్ మెటీరియల్ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలూరు మహేందర్, నామని వెంకటేష్‌నేత, ఎస్ నాగయ్య, రాజు మహారాజ్, వెంకట్ రెడ్డి,అశోక్, కాంట్రాక్టర్లు. భరత్‌రెడ్డి, మనోహర్, బాల్‌రెడ్డి, శంకర్‌లతోపాటు మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు గౌరవ అధ్యక్షులు ఎ.మహేందర్, అధ్యక్షుడు ఎం.కనకాచారి ప్రధాన కార్యదర్శి ఆర్.ప్రదీప్‌రెడ్డి, కోశాధికారి రాజు, ఉపాధ్యక్షులు వి.సత్యనారాయణ, వి. నవీన్, సంయుక్త కార్యదర్శి గణేష్, నరేందర్‌రెడ్డి, సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మహిళ హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

### వివాహేతర సంబంధమే కారణం.. నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు..వివరాలు వెల్లడించిన ఎసిపి శంకర్‌రెడ్డి





వివరాలు వెల్లడిస్తున్న ఏసిపి శంకర్‌రెడ్డి

**దుండిగల్, నవంబరు 9 ప్రభాతవార్త:** వివాహేతర సంబంధం మహిళ హత్యకు దారి తీసింది. పెళ్లిచేసుకోమన్నందుకే ఘాతుకానికి పాల్పడ్డారు. శనివారం దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేధించారు. నిందితులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మేడ్చల్ ఏసిపి శంకర్‌రెడ్డి వెల్లడించారు. మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, తిమ్మాపూర్‌కు చెందిన స్వాతి(28) రమేష్ దంపతులు. వీరికి ఇద్దరకు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి ఉపాధి పొందుతున్నారు. స్వాతికి ఏడాది క్రితం ఎల్లమ్మ బండకు చెందిన మాజీ రౌడిషీటర్ బోయ కిషన్ (43)తో పరిచయం ఏర్పడి అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం ఆమె భర్త రమేష్‌కు తెలియడంతో పద్దతి మార్చుకోవాలని మందలించాడు. వివాదం తారస్థాయికి చేరడంతో భర్తను విడిచిపెట్టి స్వాతి పిల్లలతో కలిసి బహదూర్‌పల్లిలోని గ్రీన్‌హిల్స్ కాలనీలో కిషన్‌కు చెందిన ఇంట్లో నివాసం ఉంటుంది. ఈక్రమంలో వీరి సంబంధం విషయమై కిషన్ కుటుంబంలో కొంత కాలంగా తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో స్వాతి తనను పెళ్లి చేసుకోవాలని, లేనిపక్షంలో ఇరువురం సన్నిహితంగా ఉన్న ఫోటోలు, వీడియోలు బయటపెడతానని కిషన్‌పై ఒత్తిడి తీసుకొచ్చింది. ఎప్పటికైనా ప్రమాదమే అని భావించి స్వాతిని అడ్డుతొలగిస్తే లైఫ్ సెటిల్ చేస్తా అని తన మేనల్లుడు రాజేష్(26)కు తెలిపాడు. దీంతో రాజేష్ తనవద్ద పనిచేస్తున్న వంశీ(24) సహాయంతో శనివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో స్వాతి ఇంటికి చేరుకొని తన కొడుకు ముందే గొంతు కోసి హత్యచేసి అక్కడినుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సీసీ పుటేజీలు పరిశీలించి అనుమానాస్పదంగా ఉన్న రాజేష్, వంశీలను సాయంత్రం భౌరంపేట కెఎల్‌హెచ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. కిషన్ సూచన మేరకు హత్యకు పాల్పడినట్లు తెలపడంతో కిషన్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. స్వాతి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడడంతో ఘాతుకానికి ఒడిగట్టినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన కత్తి, ఒక కారును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా కిషన్‌పై గతంలో రౌడీషీట్‌తో పాటు వివిధ పోలీస్‌స్టేషన్లలో 8కేసులు నమోదైయ్యాయని అన్ని కేసులు డిస్పోస్ అయినట్లు తెలిపారు. హత్య కేసును చాకచక్యంగా ఛేధించిన సిఐ సతీష్, డిఐ బాల్‌రెడ్డి, ఎస్సైలు రామ్మోహన్‌రెడ్డి, సరళ, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ రాజు, గణేష్‌కుమార్, రమేష్‌లను అభినందించారు.

### బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటల

**చిక్కడపల్లి, నవంబరు 9 ప్రభాతవార్త:** బాలానందంట్రస్ట్ ఆధ్వర్యంలో 86 వార్షికోత్సవం సందర్భంగా నవంబరు 9వ తేదీ నుంచి జంటనగరాల బాలబాలికలకు వివిధ అంశాలపై ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వివరించింది. నారాయణగూడలోని ట్రస్ట్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమాలకు సంబంధించి ఇతర వివరాలకు 8121023248 ద్వారా పొందవచ్చన్నారు. నర్సరీ నుంచి 9వ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులని అన్నారు. నర్సరీ రైమ్స్(తెలుగు), నీతిపద్యాలు, భక్తిగీతాలు, లలిత గీతాలు, సినిమా పాటలు, కర్ణాటక సంగీతం, రామదాసు కీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు, చిత్రలేఖనం, కూచిపూడి, భరతనాట్యం, భక్తిగీతాలు తదితర అంశాలలో పోటీలుంటాయన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి త్వరలో జరగబోయే వార్షికోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తారు.

### ఉచిత మెడికల్ క్యాంప్

**కంటోన్మెంట్, నవంబరు 9 ప్రభాతవార్త**

శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్ ఆదివారం వార్డు 5 కాకాగూడ కమ్యూ నిటీ హాల్లో మారేడ్‌పల్లి లయన్స్ క్లబ్, మెడికవర్ హాస్పటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంపులో పేద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, గైనకాలజి, కార్డియా లజీ విభాగాలలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందు లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ముకుల్ మాట్లాడుతూ కంటి పరీక్షలలో కళ్ళజోళ్ళు అవసరమైన వారికి త్వరలోనే ఉచితంగా అంద జేస్తామని, ఆపరేషన్లు అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లను శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా చేయిస్తామని తెలిపారు.

# చిన్నారుల కళాప్రదర్శనలు అద్వితీయం

### కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి





భారత్ బాలోత్సవ్‌లో ప్రదర్శనలిచ్చిన చిన్నారులతో వేణుగోపాలాచారి, లలితారావు తదితర గురువులు

**రవీంద్రభారతి, నవంబరు 9 ప్రభాతవార్త :** జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న భారత్ బాలోత్సవ్‌లో చిన్నారుల వివిధ ప్రదర్శనలు అద్వితీయం,అపూర్వమని కేంద్ర మాజీమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. బాలల ప్రియతమ నాయకుడు, భారత దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు నవంబరు 14న ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకొంటున్నామని, పిల్లలంటే ఆయనకు అమితమైన ప్రేమానురాగాలకు గుర్తు అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు చిన్నారులను ఆహ్లాదపరుస్తూ వారిలో నిగుఢీకృతమైన ప్రతిభ నైపుణ్యాన్ని చాటుకునేందుకు జాతీయ కళామందిరం రవీంద్రభారతి ప్రధాన వేదికను అందించి ప్రోత్సహించడం హర్షదాయకమన్నారు. గత 12 సంవత్సరాలుగా జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వందలాదిమంది చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలతో భారత్ బాలోత్సవ్ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని లలితారావు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. సముద్రాల వేణుగోపాలాచారి గౌరవ అతిథులు గురువులు నరేష్‌కుమార్, విజయలక్ష్మి, కళాశారద, మానసతో కలిసి చిన్నారులను జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సన్మానించి గురువులను అభినందించారు.



బిక్షి పతియాదవ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న

## బిక్షపతియాదవ్‌కు ఘన నివాళులు

**బోడుప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్ సోదరుడు, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు తోటకూర బిక్షపతియాదవ్ సేవలు మరువలేనివని మండలి ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో జరిగిన భిక్షపతియాదవ్ పెద్దకర్మ వేడుకల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి 25 ఏళ్లుగా అధ్యక్షుడుగా పార్టీ కోసం కృషి చేశారని, పార్టీకి ఆయన లేని లోటు తీరనిలోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మేడ్చల్ బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్‌గౌడ్, పీర్జాదిగూడ పట్టణ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ఘట్కేసర్ మండల్ అధ్యక్షుడు కర్ర రాజేష్ ,మాజీ కార్పొరేటర్లు జడిగె మహేందర్‌యాదవ్, కౌడె పోచయ్య కురుమ, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, భూక్య సుమన్‌నాయక్,కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, తోటకూర బిక్షపతియాదవ్ కుమారులు తోటకూర రవీందర్‌యాదవ్, సురేష్‌యాదవ్,మల్లేష్‌యాదవ్ ,విజయ్‌కుమార్‌యాదవ్,శ్రావణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 11న ఆర్టీసీ జెఏసి ఆవిర్భావం

**చిక్కడపల్లి నవంబరు 9( ప్రభాతవార్త):** టిజిఎస్ ఆర్టీసిలో జెఎసి ఏర్పాటు చేయాలని ఉద్యోగ కార్మిక సంఘాలు నిర్ణయించుకున్నాయి. కలిసికట్టుగా సర్కారుపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని భావిస్తున్నాయి. ఈ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయా సంఘాల నేతలు తెలిపారు. ఆదివారం ఆజామాబాద్లోని ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సంఘాల ప్రధాన నాయకులు సమావేశమై జెఎసి ఏర్పాటుపై మంతనాలు చేశారు. ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటిగౌడ్ (ఇయు), కమలాకర్ గౌడ్ (టిఎంయు), కత్తుల యాదయ్య (బికెయు), జివికె యాదవ్ (బిడబ్ల్యుయు), యాదగిరి (కెపి) తదితరులు పాల్గొని చర్చించారు. ఈ నెల 11న టిజిఎస్‌ఆర్టిసి జెఎసి ఆవిర్భావం కానుందని చెప్పారు. నూతన కమిటీ ఏర్పాటు, భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలకు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించనున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ఆర్టిసి ఉనికికి, కార్మికుల భద్రత, ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులతో ప్రమాదాలు ముంచుకొస్తున్నాయని గుర్తు చేశారు. అందుకోసం జెఎసితో వచ్చే సంఘాలను కలుపుకొని ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు బాలెడ్డి, రాఘవులు,రామిరెడ్డి, యాదయ్య, బుద్ధ విశాల్, రాములు, సుద్దాల సురేష్, రామచంద్రం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు శనివారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు

## రచయిత్రి నాగరంజనికి లతవంశీ జాతీయ సాహితీ పురస్కార ప్రదానం

**చిక్కడపల్లి నవంబరు 9(ప్రభాతవార్త):** వంశీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మహా రచయిత్రి, కళాప్రపూర్ణ డాక్టర్ తెన్నేటి లత జయంతి సందర్భంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ టి.వి.నాగరంజనికి లతవంశీ జాతీయ సాహితీ పురస్కార ప్రదానం చేయబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేత కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధారాణి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ వివరించారు. చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గ్రామసభలో 15న ప్రముఖ సాహితి వేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరై పురస్కారాన్ని అందజేస్తారని తెలిపారు. సభను ప్రముఖ రచయిత్రి డాక్టర్ జలంధరా చంద్రమోహన్ ప్రారంభిస్తారని, కార్యక్రమంలో ఉగాండా దేశానికి చెందిన బూరుగుపల్లి వ్యాసకృష్ణ, హాంకాంగ్ దేశానికి చెందిన జయ పీసపాటి తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రముఖ నటుడు చంద్రమోహన్ నటించిన చిత్రాలు నుండి పాటలను విఆర్ కె ఫణి, అనిరుద్, హృషికేష్, కమలాశాస్త్రి, రూపాకుల నాగేశ్వరి, యోగిత ఆక్కిరాజు పాడుతారని తెలిపారు.

## సెల్‌ఫోన్లతో చిన్ననాటి నుంచి అనారోగ్య సమస్యలు

**- ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్**

**జూబ్లీహిల్స్, నవంబరు 9, ప్రభాతవార్త :** బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1 నాగార్జునసర్కిల్‌లోని ఎంపిఎం టైం స్క్వేర్ మాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రటాట ది బిగ్గెస్ట్ గేమింగ్ జోన్‌ను ఆదివారం ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ గోపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లా డుతూ నేటి పిల్లలు శారీరక క్రీడలకు దూరమై సెల్ ఫోన్లకు అతుక్కుపో తున్నారని దీనివల్ల చిన్నారులకు మానసికంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నార న్నారు. చిన్న వయసులోనే కళ్ల జోళ్లు వస్తున్నాయన్నారు. ఇటువంటి గేమింగ్ జోన్లు పిల్లల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయన్నారు. రటాట గేమింగ్ జోన్ నిర్వాహకులు శైలజ, కోటిబాబు మాట్లాడుతూ నగరంలోని 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న అతి పెద్ద గేమింగ్ జోన్‌గా ఇది నిలిచి పోతుందని, సుమారు 50కి పైగా క్రీడలు ఈ జోన్‌లో పిల్ల లకు అందుబాటులో ఉంటాయ న్నారు. పిల్లలకు శారీరక క్రీడలతోపాటు మానసికంగా ఐక్యు లేవల్స్ పెంచే ఆటలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. స్క్విడ్ గేమ్ సిరీస్‌లో ప్రాచుర్యం పొందిన హైపర్ గ్రిడ్ ఆట సైతం ఇందులో అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ పివిఆర్ మూర్తి, డాక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీ సెక్రటరీ కాజా సూర్యనారాయణ, శివ, సింధూర, అనూష తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.S No. 664 of 2025
Between:
01. Mr. B. Venu Gopal, S/o Late. B. Ramchander, A/a: 49 yrs, Occ: Pvt Employee.
02. Mr. B. Pramila, W/o Late B. Ramchander, A/a: 66 yrs, Occ: House Wife,
Both 1 and 2 are R/o: Prema Nilayam, H.No. 12-13-1213/1,10, Pochamma Temple, Tarnaka Secunderabad, Lalaguda, Hyderabad, Telangana-500017
03. Mr. Muthyala Annapurna, W/o. Muthyala Madhusudhan Rao, A/a: 47 yrs, Occ: House Wife, R/o: 1-1-5B, Sai Venkata Nilayam, Kakathiya Apartments, Habsiguda, Secunderabad, Jama I Osmania Hyderabad, Telangana-500007 ...Plaintiffs No.1 to 3
AND
01. All Concerned
02. The Tahsildar, Marredpally, Telangana State ...Defendants No.1 & 2
To,
All Concerned whomsoever
It may concern whereas the plaintiffs have filed above suit against the defendants for declaration to declare themselves as legal heirs of Late B. Ramchander, S/o, Late. Yellaiah, who was expired on: 28/06/2020, in respect of any objections from anyone for the declaring the legal heirs of Late B. Ramchander S/o. Late. Yellaiah, Take Notice that the above case is posted on: 20/11/2025, at 10.30 AM for appearance of defendants and filing objections or claims, in default the case will be decided exparte in accordance with law.
( BY ORDER OF COURT )
Gurram Sridhar,
Musali Pramod,
Smt. K Srijaya
Advocates & Legal Consultants
Off: 2-22-157, (SCB) Flat No.001, Jagnidhi Building, Margadharshini Colony, Near Swamy Narayana Mandir, Rasoolpura, Sec-bad-3, TS. Cell No.9676209696

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS

CHANGE OF NAME
★ I Mohammed Rahmath Biya Bani S/O Mohammed Gulam Rasool Biya Bani. H.No.19-2-125/e/3/8/8 Indra Nagar, Tadban, Bahadurpur, Hyderabad, 500064. Splitting my name as Given name: Mohammed Rahmath, Surname: Biya Bani.
(Ro.No.29345)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.





నందిగామలో జరిగిన సదర్ కార్యక్రమంలో దున్నపై స్వారీ చేస్తున్న బాలుడు

## ధూం ధాంగా సదర్ ఉత్సవం

### అబ్బుర పరిచిన దున్నల విన్యాసాలు- యాదవ సంఘ నేతల జోష్

## విశ్వేశ్వరునికి ఘనంగా పాసుపత రుద్రహోమం

**ఘట్‌కేసర్, నవంబరు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీవిశ్వేశ్వరగిరి క్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగా శివస్వామికి ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీరాజరాజేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామికి నిత్యం అర్చకులు శివకుమార్ మంత్రోచ్చారణాల మధ్య ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అక్టోబర్ 20న ప్రారంభమైన కార్తీకమాస పూజలు ఈనెల 20 వరకు కొనసాగనున్నాయి. సహస్ర విశ్వేశ్వరస్వామి ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక అభిషేకాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్తీక మాస పూజల్లో భాగంగా ఆదివారం ఆరుద్ర నక్షత్ర పాసుపత రుద్రహోమం, పార్థీవ లింగార్చన ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, పండ్లు, పత్రాలతో అలంకరించి దీపాలను వెలిగించారు. ఆలయంలో వివిధ దేవతామూర్తులతో సర్వదేవతా ఆలయంగా పేరుగాంచిన ఈదేవస్థానం ఆవరణలో 35 అడుగుల ఎత్తైన పంచముఖి అంజనేయస్వామి విగ్రహం ప్రధాన ఆకర్షణగా ఉంది. ఆలయంలో మరకత, గోమేధ, స్పటిక, పంచలోహ లింగం, పాదరస లింగం, శ్రీప్రత్యంగిరాదేవి ఒకే చోట ఉన్న మహిమాన్విత పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ప్రతినెలా అమావాస్య రోజున ప్రత్యంగిరాదేవి హోమం జరుపబడుతుందని శ్రీవిశ్వేశ్వరగిరి పీఠాధిపతి శ్రీఆత్మానంద భారతీస్వామి తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు ఆలయానికి వచ్చి విశ్వేశ్వరస్వామికి పూజలు చేసి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## ఘనంగా గ్యార్మీ షరీఫ్





ఆమనగల్లులో జెండా ప్రతిష్ట చేస్తున్న దృశ్యం. అన్నదానం చేస్తున్న అంజుమాన్ గులాబీ ముస్తఫా కమిటీ సభ్యులు

# ఆర్టిసి డ్రైవర్ల మెడకు వీఆర్ఎస్ కత్తి





### సిబ్బంది పొట్టగొట్టనున్న ప్రధానమంత్రి ఈ-డ్రైవ్

### కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సులు రంగప్రవేశం

### హైదరాబాద్‌లో తొలి విడతగా 776 రాబోయే రోజుల్లో ప్రతి డిపోలోనూ 100 శాతం..

### బలవంతపు పదవీ విరమణకు ఒత్తిడి

### మాట వినకపోతే ఇతర జిల్లాలకు బదిలీ బెదింపులు

### అధికారుల సీట్లు పదిలం

### తగ్గిపోతున్న యూనియన్ల ప్రాబల్యం

### సమస్యలపై పోరాడే నాయకత్వం కొరత

### ఆర్టీసీలో ఆరు వేల పోస్టులు ఖాళీ

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కాలుష్యానికి చెక్ పెట్టాలని ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు స్టాఫ్‌కు షాక్ ఇవ్వబోతున్నాయా, క్రమంగా కార్మికులను చెక్‌పెడ్తారా, అంటే కొత్త నియామకాలు కాగితపు పులులేనా.. వంటి సందేహాలు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను వేధిస్తున్నాయి. హైదరాబాద్ సిటీలో 775 వరకు ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టారు. మరో 250 బస్సులు ఆరు నెలల్లో రానున్నాయి. టెండర్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయిస్తున్నారు. క్రమంగా ప్రతి డిపోలో 100 శాతం ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టే యోచనలో యాజమాన్యం ఉన్నట్లు కార్మికులు అంటున్నారు. ఇవి పూర్తిగా అద్దె బస్సులు కావడం వల్ల సంస్థ మనుగడ ప్రశ్నార్థకమేనని వాపోతున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లలో వంద శాతం ఎలక్ట్రిక్ బస్సులు వచ్చిన తర్వాత జిల్లాలకూ విస్తరించనున్నారని అంటున్నారు. ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ కింద హైదరాబాద్‌లో వెయ్యి బస్సులకు మోక్షం లభించింది. తొలి విడతగా 776 వచ్చాయి. డీజిల్ బస్సుల వల్ల పర్యావరణం పాడవుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించి ఎలక్ట్రిక్ బస్సులను ప్రోత్సహిస్తున్నాయి. ఢిల్లీ తర్వాత జంటనగరాల్లో కూడా కాలుష్యం బారినపడి పర్యావరణం పాడువుతున్నది. లారీలు, ఆటోలు, జీపులు, ట్రాక్టర్లు వంటి ఇతర వాహనాలూ కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. రాబోయే రోజుల్లో అన్ని రకాల వాహనాలూ ఎలక్ట్రిక్‌వే రావచ్చని భావిస్తున్నారు. పర్యావరణం గురించి పక్కనబెడితే ఎలక్ట్రిక్ బస్సుల వల్ల ఆర్టీసీ ఉద్యోగులకు ఎసరు పెట్టవచ్చని ఆందోళన నెలకొన్నది. హైదరాబాద్‌లో కార్మికులను స్వచ్ఛంధ పదవి విరమణ చేయించాలని, లేదా ఇతర జిల్లాలకు బదిలీపై పంపుతారని ప్రచారం జరుగుతోంది. అప్పటి నుంచి వారు అభద్రతకు గురవుతున్నారు. సంస్థలో మునుపటి మాదిరిగా యూనియన్ల ప్రాబల్యం కనిపించం లేదు. వారి సమస్యలపై పోరాడే నాయకుడు లేడని ఆందోళన చెందుతున్నారు. జంట నగరాల తర్వాత ప్రతి రీజియన్లలో క్రమంగా ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని ప్రచారం జరుగుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలలో సుమారు 6 వేల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. ప్రతి డిపోలో 20 నుంచి 30 డ్రైవర్ పోస్టులు, 10 నుంచి 15 కండక్టర్ పోస్టులు, నాలుగైదు మెకానిక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ఖాళీగా ఉన్న 6 వేల పోస్టులలో 3 వేల మంది డ్రైవర్లను, 2 వేల మంది కండక్టర్లను, వెయ్యి మంది మెకానిక్‌లను భర్తీ చేయాల్సి ఉన్నది. ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ నోటిఫికేషన్ కోసం అంతా ఎదురు చూస్తున్నారు. దాదాపు అన్ని డిపోలలో డ్రైవర్ల కొరత వల్ల ఉన్నవారినే అదనపు డ్యూటీలు చేయిస్తున్నారు.

# ఆహార సలహా సంఘాల అడ్రసేది?



**రంగారెడ్డి అర్బన్, నవంబరు 9, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ షాపులు, అంగన్ వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే బియ్యం, ఇతర సరుకుల సరఫరా, నాణ్యతపై పర్యవేక్షించేందుకు ఆహార సలహా సంఘాలు కనబడకుండా పోతున్నాయి. అసలు ఆ సంఘాలు మనుగడలో ఉన్నాయా లేదా అనే విషయమై అనుమానాలు

### కమిటీల సమావేశాల నిర్వహణ పట్టని అధికారులు

### త్రైమాసిక మీటింగ్‌ల ద్వారా సమీక్షలు నిల్

### ఇష్టారాజ్యంగా బియ్యం, ఇతర సరుకుల పంపిణీ

### ప్రశార్థకంగా ఉన్న నాణ్యత

నెలకొన్నాయి. సంబంధిత శాఖాధికారులు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. జిల్లాలో 936 రేషన్ షాపులు ఉ పరిధిలో 34,6810 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 7,06026 మంది ప్రయోజనం పొందుతున్నారు. ఈ కార్డులపై ప్రభుత్వం ప్రతీ నెలా 16190 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తున్నది. ఈ బియ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరఫరా చేస్తున్నాయి. కేంద్రం దేశమంతటా రేషన్ కార్డుల పై దొడ్డు బియ్యం సరఫరా చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సన్న బియ్యాన్ని పంపిణీ చేయనుంది. అలాగే 1602 అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, ఇతరత్రా సరుకులు సరఫరా అవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లు, గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనాలు పెడుతున్నారు. వాటికి కూడా ప్రతి నెలా సన్న బియ్యం సరఫరా అవుతున్నాయి. సరుకుల సరఫరాను పరిశీలించేందుకుగాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేశారు. ఆహార సలహా సంఘాలకు జిల్లాస్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దారు చైర్మన్లుగా ఉంటారు. ఆయా కమిటీల్లో ప్రజాప్రతినిదులు, మహిళా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాత్రికేయులు, ఇతర శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రతి రెండేళ్లకోసారి ఈ సంఘాలు మారుతూ ఉంటాయి. ఆయా స్థాయిలోని ఈ సంఘాల సభ్యులు ప్రతీ మూడు నెలలకు ఒకసారి సమావేశమై రేషన్ బియ్యం నాణ్యత, పంపిణీ తీరు, మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించాలి. లోపాలు ఉంటే సరిదిద్దేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలి. వాటిపై ప్రభుత్వానికి నివేదించాలి. జిల్లాలో మాత్రం ఆహార సలహా సంఘాల జాడేలేకుండా పోతోంది. పర్యవేక్షణ కరవై పంపిణీ, నాణ్యత ప్రశ్నార్థకమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**-పర్యవేక్షణ లేక పక్కదారి..**

రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో ఎక్కువగా నూకలు వస్తుండడంతో ఆయా వర్గాల ప్రజలు వాటిని రేషన్ డీలర్లకు గానీ, దళారులకు గానీ కిలోకు 18 నుంచి 20రూపాయల చొప్పున విక్రయించుకుంటున్నారు. సర్కార్‌పంపిణీ చేసే సన్న బియ్యంలో 20 శాతానికి పైగా నూకలు నిబంధనల ప్రకారమే వస్తాయని వినియోగదారులకు చెప్పే వాళ్లు లేక కొంత మంది ఆ బియ్యాన్ని డీలర్లకు గానీ, బయట గానీ విక్రయించుకుంటున్నారు.

**పర్యవేక్షణ లేకపోవడంతో ఆహార నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల బియ్యం, సరుకులు నాణ్యతగా లేకపోవడంతో కొన్ని పాఠశాలల విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం గురించి ప్రశ్నించేవారు లేకుండా పోయారు. ఆహార సలహా సంఘాలు తరుచూ సమావేశమైతే ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశం కూడా ఉండేది. గతంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో కమిటీలు సమావేశమై రాజకీయ పార్టీలను సైతం సమావేశానికి ఆహ్వానించి వినియోగదారులపై ధరల ప్రభావం గురించి చర్చ చేసేవారు. కొన్నేళ్లుగా ఈ సమావేశాలు జరగడం లేదు. ఏ సరుకుల ధరలు ఏ స్థాయిలో పెరుగుతున్నాయో ప్రభుత్వ అధికార యంత్రాంగం పర్యవేక్షణ అత్యంత అవసరం.**

## సత్య దీక్ష

చీర్యాల లక్ష్మీనృసింహ్మ స్వామి దేవస్థానంలో శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయం బయట ఉన్న సప్త వృక్షాలు నాగదేవత దగ్గర కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు

-ప్రభాతవార్త, కీసర



## శరణు ఘోష

వివిధ దేవాలయాలు కారీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అదివారం మండల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కుల్కచర్ల అయ్యప్ప సేవా సమితి స్వాములు 41 రోజుల దీక్ష స్వీకరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ప్రభాతవార్త, కుల్కచర్ల



## మలక్‌పేట్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

### ముగిసిన జిల్లా స్థాయి గురుకుల క్రీడోత్సవాలు

### విజేతలకు బహుమతుల పంపిణీ

**శామీర్‌పేట, నవంబరు 9, ప్రభాతవార్త :** శామీర్‌పేటలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో జరిగిన హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడా ఉత్సవాలు ముగిశాయి. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమం జరిగింది. నగరంలోని వివిధ మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడాఉత్సవాల్లో, పోటీల్లో సుమారు 1200మంది వరకు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతితిగా రంగారెడ్డి జిల్లా ఆర్‌సిఓ బి.రాజేశ్, హైదరాబాద్ జిల్లా డిసిఓ కె.వెంకట్రావ్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.రవి కుమార్, ఎటిపి శేఖర్, ఎటిపి హెప్సిబా, ఆర్గనైజింగ్ ఫిజికల్ డైరక్టర్ కె.వెంకట్‌రెడ్డి, సాయికుమార్, సాయిబాబు, స్పోర్ట్సు కమిటీ మెంబర్స్ జె.నరేశ్, వి.టెండుల్కర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. వివిద పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ఆర్‌సిఓ బి.రాజేశ్ పలువురు అందజేశారు. కబడ్డీలో



శామీర్‌పేటలోని గురుకుల పాఠశాలలో జరిగిన హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదాన దృశ్యం

# ఇక మా వల్ల కాదు

### పంచాయతీలను వెంటాడుతున్న నిధుల కొరత

### పేరుకుపోతున్న పన్నుల బకాయిలు

### చిన్న చిన్న అవసరాలను సొంత ఖర్చులతో క్లియర్ చేస్తున్న కార్యదర్శులు

### ప్రభుత్వం నుంచి తిరిగి రాని ఖర్చుల బిల్లులు

### సామగ్రి ఇచ్చేందుకు షాపుల నిర్వాహకులు నిరాకరణ

### చేతులెత్తేసిన కార్యదర్శులు

### నిలిచిపోతున్న పనులు

### కనీస అవసరాల ఇబ్బందులూ అనుభవించక తప్పని వైనం

**కోట్‌పల్లి, నవంబరు, 9, ప్రభాతవార్త;** హైకోర్టు తీర్పుతో స్థానిక సంస్థ ఎన్నికలకు బ్రేక్ పడటంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాలు లేకుండా దాదాపు రెండు సంవత్సరాలుగా నిధులు కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. నిధులలేమి కారణంగా గ్రామల్లో అభివృద్ధి పనులకు అటంకాలేర్పడు తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు విడుదలైన నోటిఫికేషన్ పుణ్యమా అని ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలు భారీగా వసూలవుతాయని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆశపడ్డారు. హైకోర్టు తీర్పు కారణంగా సెక్రటరీల ఆశలు అవిరయ్యాయి. బకాయిలు క్లియర్ అయ్యేందుకు ఉన్న మార్గం తాత్కాలికంగా మూసుకుపోవడంతో నిరాశకు గురయ్యారు. నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సమస్యలు ఎక్కడిక్కడ కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. ఇంతకాలం చిన్నచిన్న ఖర్చులు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమ వల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో వీధి దీపాలు వెలగకపోయిన, బోరు పని చేయకపోయిన ట్రాక్టర్లలో డీజిల్ లేకపోయిన వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఇంతకాలం కార్యదర్శులు సొంతంగా వెచ్చించిన ఖర్చులు తిరిగి రాకపోగా, నగదు



చెల్లించకుండా సామగ్రిని ఇచ్చేందుకు షాపుల నిర్వాహకులు నిరాకరిస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

## 26 కిలోల గంజాయి పట్టివేత

**వికారాబాద్, నవంబరు 9, ప్రభాతవార్త:** 26 కిలోల గంజాయిని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ విజయభాస్కర్ ఆదేశాను సారం ఆదివారం వికారాబాద్ రైల్వే పరిసర ప్రాంతాలు తనిఖీ చేయడం జరిగతింది. విశాఖపట్నం నుంచి రైలులో గంజాయి రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారులు వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాలు తనిఖీ చేస్తుండగా, అనుమానాస్పదంగా 3 బ్యాగులు కనిపించాయి. వాటిని తెరచి చూడగా, అందులో 26 కిలోల గంజాయా ప్యాకెట్లు బయటపడ్డాయి. ఈ బ్యాగులు ఎవరివని ఆరా తీసిన ఎవరూ ముందుకు రాలేదు. దీంతో బ్యాగులను తెరచి చూసినట్లు ఆయన తెలిపారు. టాస్క్‌ఫోర్లు తనిఖీలను పసిగట్టి దండగులు బ్యాగులు వదిలేసి పారిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్లు సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, పి.రవికిరణ్, కె.శివప్రసాద్, కుమార్ తదితరులు ఉన్నారు. గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు



హాజీపూర్‌లో బస్సు ప్రమాద బాధితులకు నగదు అందజేస్తున్న ఎంపి కొండా

## ప్రైయివేటు ఉద్యోగాలు ఇప్పిస్తా

### బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు ఎంపి కొండా హామీ

**యాలాల నవంబరు 9,ప్రభాతవార్త :** చేవెళ్ల బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఆదివారం ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ముందుగా యాలాల మండలంలోని హాజీపూర్ గ్రామాన్ని సందర్శించి ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ఆయన ఓదార్చి రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాధలైన పిల్లలను చదివించేవిధంగా చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. చదువులు పూర్తయిన అనంతరం ప్రైయివేటులో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చిరు. అనంతరం లక్ష్మీనారాయణపూర్, పేర్కంపల్లి గ్రామాలను సందర్శించిన ఆయన మృతులకు టుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయా కుటుంబాలకు ఎంపి రూ.20వేల నగదును అందజేశారు. మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని ఎంపి తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడానని వారం పది రోజుల్లో బాధితులకు కేంద్రం నుంచి పరిహారం అందుతాయని ఆయన తెలిపారు. ఎంపి వెంట యాలాల మాజి ఎంపిపి తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా బిజెపి నాయకులు తదితరులు ఉన్నారు.

## బాలానగర్ మండలంలో జూబ్లీ పోలింగ్ బూత్ కేంద్రాలు

### నేడు, రేపు సెలవు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు 9, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బాలానగర్ మండలంలో పోలింగ్ నిర్వహిస్తున్న ఆ బూత్‌ల కేంద్రాల ఆఫీస్‌లకు, సంస్థలకు ఈ నెల 10,11తేదీలలో వేతనంతో కూడిన సెలవు దినాలుగా ప్రకటిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులను జారీ చేశారు. ఆదివారం ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని బాలానగర్ మండలంలో పోలింగ్ జరిగే ఆఫీస్‌లకు, సంస్థలకు వేతనంతో కూడిన సెలవులుగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీల్ల ఉప ఎన్నికల 11వ తేదీన జరుగనుంది. ఈ సందర్భంగా ఆ నియోజకవర్గంకు సంబంధించి జిల్లా పరిధిలోని బాలానగర్ మండలంలో పోలింగ్ బూత్ కేంద్రాలు ఏర్పాటు చేయటంతో ఆయా ఆఫీస్‌లకు, సంస్థలకు వేతనంతో కూడిన సెలవులు ఈ నెల 10,11తేదీలను ప్రకటించారు.

